తొడిమ.

ఈకథ వాడుకభాషలో వ్రాసేటందుకు నాకు ప్రోత్సాహం
గించినవారు ప్రతిభానిధులు రెంటాల - వేంకటసుబ్బారావు
తులుగారు. బహుశ్రుతులు ప్రొఫెసరు రంగాచార్యులవార
నటు మీటింగులో యిచ్చిన ఉపన్యాసంకూడా తోడ్పడినది.
ప్రతి వ్యాకరణం ప్రకారం భాష నేర్చుకోలేని సామాన్యజను
ు చదువు తెరువు చూపించడంకోసం, చెదరులుగా లోకంలో
కొనివున్న యీకథను సంస్కృతంచూచి పెంచి పెద్దచేసి
ాసి ప్రచురించినాను. శ్రీ సుబ్బారావు పంతులుగారు తమ
ద్దేశమును కడపట "హెచ్చరిక" అని సమకూర్చినారు. అనే
ు కీకథ వినిపించినాను. సంతోషించినారు. అద్భుత ప్రతిభ
ు వేపా - రామేశం పంతులుగారు సకుటుంబముగా విని
ు సంతోషం వెయ్యినోళ్ల వెల్లడించినారు. ఇట్టివారి సంతో
మే నాకు పదివేలు.

వేటూరి - ప్రభాకరశాస్త్రి.

My friend, Mr. V. Prabhakara Sastri was kind enough to read to me the Story of "కామధేనువు కథ" adapted from the Padma Purana (see also Manuscripts No. 44 in the Triennial Catalogue of Manuscripts by Prof. Rangachari) written by him in a new prose style and I take this opportunity of expressing the great delight felt by me and the members of my family in listening to it.

The important feature about it is the introduction of a few forms of inflexions of verbs and nouns not sanctioned by the rules of Telugu Grammar; but, it must be observed, that they have received the sanction of usage as I find them used in inscriptions, in historical narratives found in manuscripts in the Oriental Library and in proverbs. Unless we are prepared to reject these as valueless in a controversy of this sort, it follows that they are legitimate and permissible modes of expression. They are part of the language. No doubt the orthodox School of Telugu writers who still hold to the view that no changes ought to be made in the rules regulating Telugu composition will not accept these forms. But, if we reject them the loss to the Telugu language and literature is immense. The changes involved are mostly in the direction of simplification and are eminently fitted for use in books for

children, females and the general reader. Some of them appeal to the ear by their grace. It may be here pointed out that Mr. Sastri is not an advocate of the free adoption of all the colloquial forms of expression in use in the various dialects prevailing in the country. He does nothing of the sort in the book. The changes cannot, indeed, be characterised as vulgar except to the strict grammarian who is unable to shake off the shackles of the ancient rules. If our efforts to extend the basis of primary education and to diffuse knowledge and culture even among the lowest classes are to be crowned with success, some such departure from the traditional restrictions is absolutely essential. One may observe that a language which has a crystalised structure and cannot change can never be progressive and cannot be expected to unfold all the possibilities natural to its genius and latent in it. It is to be hoped that the new style will be accepted and be brought into general use.

V. RAMESAM.

శ్రీరస్తు.

కామధేనువు కథ.

గంగానదికి వుత్తరభాగాన గోకర్ణం అనే పుణ్యక్షేత్రం కద్దు. దాని చేరువను పూర్వం వొక అగ్రహారం వుండేది. ఆ అగ్రహారంలో వొక బ్రాహ్మణుడు, చాలా ఆవులను ఆర్జించుకుని, వాటికి కామాక్షి మీనాక్షి విశాలాక్షి అన్నపూర్ణ కపిల కామధేనువు మొదలయిన పేర్లు పెట్టుకుని సాకుకుంటూ తానూ తన సోమిదమ్మా నిత్యం ధూపదీపనైవేద్యాలిచ్చి పూజచేస్తూ సుఖాన వుండేవారు. ఆగోవులను సంరక్షణ చేసేటందుకు వారు గోపాలుడనే వొక గొల్లవాణ్ణి ఏర్పరిచినారు. వాడీపశువులను దినదినమూ మూడువేళలా నీళ్లూ మేతా కలిగినస్థలాలకు తోలుకుపోయి మేపి నీళ్లు తాగించి పెంటుగడియాయి నీడను పడుకో నిచ్చి నొప్పీదప్పీ కలుగకుండా పోషిస్తూ వుండేవాడు. ఈ విధంగా, గట్టులను, వంకలను, కసువుగలజాగాలను, మేపుతుంటూ, మహాభక్తితో వాడు కాపాడుతూ వుండగా వొక కాలాన వచ్చిన వేసంగికి చెరువులు, గుంటలు, వాగులు, వట్టిపోయెను. నీళ్లు మేతలకు తక్కువ కావడంచేత అప్పుడా గోపాలుడు, గోవులను దూరంగా కొండలోయలలోకి తోలుకుపోయి మేపుతూ వుండగా

ఒకదినమందు కారుమబ్బులు కమ్ముకొని మహాప్రళయముగా గాలి, ఉరుములు, పిడుగులు, మెరుపులు మెండుకొని అఘోరమైన వర్షంపట్టెను. ఆకొండలోయలో యెడ విడువకుండా వాన కురిసేటందుచేత గోవులన్నీ చెల్లాచెదరై బెదరి నలుముఖాలకూ పోయెను. అందులో కామధేనువనేగోవు ఒంటిగా చెదరి అక్కడొక కోనలో ఒక గుట్టకింద ఒదిగి యీదురుగాలికి వణకుతూ వుండగా ఆసామీప్యాననే గుహాలో నెలదినములనుంచి ఆహారంలేక కృశించివున్న పులిఒకటి, గుహబయటికి వచ్చి, ఆ వణకుతూవున్న కామధేనువును తేరిపార చూచెను. చూచి మహాసంతోషంతో ఒకచెట్టుమరుగున నక్కి, చెవులు కొక్కరించి, తోకనిట్టపొడుచుకుని, కొండంతది కుక్కంతదిగా ఒదిగి, వచ్చి ఆకామధేనువును గోళ్లతో గొట్టి మెడకరచుకుని ప్రాణంతో తనగుహాలోకి తీసుకుపోయి అంతట వధించి భక్షించవలెనని ప్రయత్నపడేటప్పటికి కన్నులనీరు కారగా మహా దుఃఖముతో ఆకామధేనువు అడలసాగెను. అది చూచి వ్యాఘ్రరాజు ముఖంఅంతా కళ్లుచేసుకుని యీవిధంగా పలికెను. కామధేనువా! నీ వేలదుఃఖపడేవు? నేను నెలదినములనుంచి ఉపవాసంతో భక్షణదొరకక కృశించి వున్నాను. ఈ పొద్దు నేను లేచినవేళ చాలామంచిది. కిందటిజన్మాన యెవరికో మృష్టాన్నం పెట్టినాను. ఆఫలం నేడు అనుభవానకు వచ్చినది.

నిన్ను నేను విడిపెట్టవలసినది లేదు. నీకు మృత్యువను నేను గనుక నాకు దొరికితివి. నీచావు యేడిచినా తప్పదు. నవ్వినా తప్పదు. నోటికి చిక్కిన ఆహారం వదులుకుంటానా? ఎందుకు దుఃఖిస్తావు? వ్యర్థము. ఇట్లా అన్నంతట కామధేనువు పల్కిన వివరం. విను వ్యాఘ్రరాజా! శరీరాలు భూమిమీద శాశ్వతాలు కావు. పుట్టడం యెప్పుడయితే కలిగిందో చావడం అప్పుడే కలిగింది. తప్పని సరి అయిన చావుకు దుఃఖిస్తే ఫలంకద్దా! యీ చావు అన్నిప్రాణులకూ కలుగుతుందా నాకు వొక్కదానికే నేకు కలిగిందా? భూమిమీద బ్రతకడం నీళ్లమీద బుగ్గచందం. అందులో నాల్గుపాదాల జంతువులకు వ్యాధులు అనేకం. అలాటి వ్యాధులచేత చావడంకంటె నీచేత మృతిపొందడం భాగ్యం కాదా! నేను చేసుకున్నపుణ్యంచేతనే నీకు దొరికితిని. ఇదిగాక, నీకు చిక్కినతర్వాత ప్రాణికి మరి బ్రతుకెక్కడుంటుంది? నేను చావడానికి వెరచి దుఃఖించేదానిని కాను. నావ్యసనం వేరు. మనవిచేస్తున్నాను చిత్తగించు; ఓమృగరాజా! నేను చాలాకాలం బిడ్డా పాపా లేక నోయరానినోములు నోచి పట్టరానివ్రతాలుపట్టి రాతిరాతికీ మొక్కి గుంటగుంటలో మునిగి సకలదేవతలనూ ప్రార్థనచేయగా యీశ్వరకృపాకటాక్షంచేత గొడ్డుపోయినా కడుపున వొకబిడ్డడు పుట్టాడు. లేక లేక పుట్టినకూన. పాలుకుడుచుకోవడమేగాని యింత కసవుమేయడం నేరడు. నేను పొలం

పోయి సాయంకాలాన తిరిగివచ్చేవరకూ నాదారే యెదురు చూస్తూ అడలుతూవుంటాడు. వాడికిసహవాసం రెండోవారు లేరు. వివేకము తెలిసిన శిశువు కాడు. నే నీపొద్దు పొద్దున లేచివచ్చేటప్పుడు బ్రాహ్మణమ్మవారు పాలుపిండేసమయాన నా బిడ్డ కొకచేపు దాచుకోక జల్లున చేపినాను. కపటము చేయలేక పోయినాను. చిన్నవాడు ఆకలితో యెంతవరుసుతున్నాడో తెలియదు. నేను ఇక్కడ చిక్కితిని. వానిబ్రతుకు యేమవుతుందో! కడుపుమోహంచేత మరుగుతూవున్నాను. ఒక్కసారి నాబిడ్డదగ్గరకు పోయి కడుపారా కడసారి పాలుకుడిపి, నాముద్దు తీరేటట్టు ముఖంనాకి యిరుగుతో పొరుగుతో చెప్పి వొప్పగించి మంచిచెడ్డలు కొంచెం తెలియజేసి యింతలో తిరిగి వస్తాను. ఇప్పుడు నాకు చేపువచ్చింది. కనుక నామీదచాలా దయవుంచి సెలవిస్తే నాలుగుగడియలలో శీఘ్రంగా వస్తున్నాను. ఈపుణ్యానకు వొప్పితివా యిప్పుడు భక్షించేవాడవు యిక కాస్తసేపటికి భక్షిస్తున్నావు. నీవు ధర్మాత్ముడవై నాకు అనుజ్ఞ యివ్వవలెను. కడుపుతీపు పీడిస్తూవున్నది. నత్యంతప్పక వస్తాను. ప్రమాణం. నామీద దయవుంచి పంపవయ్యా! అని కోరినంతట వ్యాఘ్రం అన్నవాక్యం. ఏమి టిది! మరణం మెరుగవా? నన్ను చూస్తే జంతువు లన్నీ ప్రాణాలు వదలేవి; నీవు చింతాకంతైనా భయంలేక జాలిపడుతూ బిడ్డ బిడ్డఅని అడలుతూ

వున్నావు; చచ్చేదానిని బ్రతికించడం బిడ్డచేతగాదు, అమ్మచేత గాదు, అబ్బచేతగాదు. నీవు నీబిడ్డదగ్గరకు వెళ్లి యిరుగుపొరుగు నుచూచి యింకా తిరిగిరావడం యెక్కడిది? ధరణిలో పశుజీవాలకు యేటినియమం? యేటిసత్యం? ఇదికలియుగం. న్యాయానకు కాలంకాదు. ప్రాణం నిమిత్తం సూరబద్ధాలైనా ఆడి విడిపించుకుపోవలె ననే యత్నాలే కాని సత్యానికి కట్టుపడి తిరిగీ వచ్చేవా రెవరుంటారు? చావంటే భయపడుతారు గాని నీవు నన్ను చంపవయ్యా అని వస్తారా? ఎక్కడ నిజం! ఎక్కడ కథ! ఇట్లా యెందుకు మాయలుచేస్తావు? అని నుందలించెను. అందుకు కామధేనువు సత్యప్రమాణకంగా చెప్పేమాటలు. పులిరాజా! నామీద ఆగ్రహించక కరుణించు. ఈనువారికి తోడువారికి నాపసిబిడ్డను వొప్పజెప్పి వస్తాను. రాకపోతే వొట్టు; నమ్మి విడిచిపెట్టు. నేను మాటతప్పేదానిని కాను. ప్రపంచంలో అందరూ అసత్యవాదులే అయితే యెట్లా జరుగుతుంది? ఎవ్వరికీ బ్రతుకు శాశ్వతంకాదు. తాముపోయేది తాము కానరు. నేను సత్యప్రమాణకంచేసి చెప్పుతాను నీ వవశ్యం నమ్మవయ్యా! ప్రపంచంలో వున్నసత్యవంతులు, ధర్మాత్ములు, జ్ఞానవంతులు, సకలమునీశ్వరులు, రాజాధిరాజులు, మహాపతివ్రతలు, సూర్యచంద్రాదులు వినేటట్టుగా ఆనపెట్టుకుంటున్నాను. పృథివిలో నియమం లేనివాడు, దబ్బరలాడినవాడు, వ్యవహారధర్మాలు అన్యా

యంగా తీర్పుచేసినవాడు, మనసున కపటంపెట్టుకుని మధుర వాక్యాలు పలికినవాడు, గ్రామానకు చేటు తెచ్చినవాడు, బీదసాదులను కొట్టినవాడు, చెవిటివాణ్ణి, కళ్లులేనివాణ్ణి, అనాదరణచేసినవాడు, లేనిభాగం కద్దన్నవాడు, కాసేపూసేచెట్టు కొట్టినవాడు, చెరువుముఖస్థలాలు దున్నినవాడు, నడితిలేని నడవళ్లు నడిపించినవాడు, తల్లిదండ్రులను చెడనాడినవాడు, తనమరుగు చొచ్చినవారిని పట్టిచ్చినవాడు, బంధుజనమును దూషించినవాడు, కులపాతకం చేసినవాడు, అల్పజాతితో సావాసంచేసినవాడు, సజ్జనుడిమీద నిందలుచెప్పినవాడు, దుర్జనుణ్ణి భూషించినవాడు, చదువుచెప్పిన అయ్యవారిని ఆక్షేపించినవాడు, తనదొరను రణభూమిని విడిచిపెట్టి తనప్రాణంకొరకు పారిపోయినవాడు, తాగేగంజి వలకబోసినవాడు, విద్వాంసులను దూషించినవాడు, నీళ్లను నిందచేసినవాడు, తోవలు కొట్టి దోచుకున్నవాడు, అన్యులసొమ్ముకు ఆశపడ్డవాడు, దూడలకు నాలుగోపాలు పాలువిడువక అన్నీపిండుకున్నవాడు, నోరెరుగని పక్షి మృగాదులను చంపినవాడు, అప్పుతీసుకుని అన్యాయంగా అప్పుడే యిచ్చివేసినావని తగవుపెట్టినవాడు, ప్రభుత్వం చేస్తూ, ధర్మంవిడిచి దండుగులు తీసుకున్నవాడు, పీటలమీది పెళ్లిళ్లు చెడగొట్టినవాడు, ఒకళ్లమేలు వోర్వలేక వుసూరుమన్నవాడు, చూస్తూచూస్తూనే కళ్లలో దుమ్ముకొట్టి ద్రోహం

చేసినవాడు, భిక్షం పెట్టక తానుకుక్షి నించుకున్నవాడు, విడిచికట్టక దున్నినవాడు, ఎరుగనిదే నేరం మోపినవాడు, దేవబ్రాహ్మణ మాన్యాలకు చిక్కు తెచ్చినవాడు, ఒకరినివంచించి అవహాస్యం చేసినవాడు, దార్లకు కంపకొట్టి మార్గస్థులతో జగడంవేసినవాడు, పూర్వంనడిచిన ధర్మం తామనంచేత తానై చెడగొట్టినవాడు, ఎరువుకు సొమ్ముతీసుకుపోయి దొంగలు దోచుకున్నారని ముంచినవాడు, పంక్తిభేదంచేసినవాడు, ధారాదత్తమనో దత్తాలు మొగవేసినవాడు, ధర్మమని మాటయిచ్చి ఆసాసపెట్టి అడిగితే లేదని కసురుకున్నవాడు, తనపెళ్లామును అన్యులమాటలువిని వెలివేసినవాడు, గురుబోధ మరచిపోయినవాడు, దూడలేనిఆవును పాలుపిండినవాడు, దాయగట్టక పితికినవాడు, పాలువుడిగిన తర్వాత పశ్రకుతోలినవాడు,—ఈలాటి అధర్మాలు చేసినవారు యేగతికి పోతారో రాకపోతే నేనూ అదేగతికి పోతాను. నేను వచ్చేదిసిద్ధం. అని యీవిధంగా సత్య ప్రమాణకం చేయగావిని వ్యాఘ్రరాజు పలికే పలుకులు. నీవైతే యెంతో నమ్మకంగా ప్రమాణాలు చేస్తున్నావు. లోకంలో చాలామంది తమపని తీరిన తర్వాత చేసినమేలు మరచిపోతారు. గట్టెక్కినతర్వాత పుట్టివాడితో పోట్లాడేమచ్చే హెచ్చు. పాలుడిగినతర్వాత పిల్ల తల్లినేవిడుస్తుంది. చేసినమేలు మరవక, ఆడినమాటతప్పక, నడుచుకునేవాళ్లు ఎక్కడో అరుదు. వేయింటి కొక్కడు వుంటాడో

వుండకో! చెప్పడంతేలికగాని చెయ్యడంకష్టం. నీవిప్పుడు వత్తా మనే అనుకున్నా అక్కడికి వెళ్లిన తర్వాత మందలో పశువులూ, నీబిడ్డా, అడ్డపడి, "ఆపులి తెలివితక్కువది. దానిని యెట్లాగో నమ్మించి దూసుకుని రానేవస్తివి. ఇంకా పోయే దేమిటి? చావు తప్పించుకునేటప్పుడు వొట్టూ లేదు సత్యంలేదు" అని నిన్ను మందలిస్తే వాటిని మలపరించుకుని యెట్లా రాగలుగుతావు? అక్కడవుండవలెనని బుద్ధిపుట్టదా అనగా నూరు ఆరైనా ఆరునూరైనా నిజానికివచ్చి వాలుతున్నాను; తప్పను; తప్పను; తప్పను; అని ముమ్మాటుచెప్పేటప్పటికి వ్యాఘ్రరాజు "నీసత్యాలు నన్ను వొప్పిస్తున్నవి. నీవు ఆడితప్పనిదానవని నమ్మకం కలిగింది. పోయిరా; మాటనిలువుకో" అని సెలవిచ్చెను. అంతట కామధేనువు వ్యాఘ్రరాజుకు నమస్కారంచేసి అంబా అంబా అని అడలుకుంటూ పొదుగు చేవులెత్తి సలపరిస్తూ వుండగా ఆదరా బీదరా తనబిడ్డదగ్గిరకు పరుగెత్తుకొని వచ్చెను. వచ్చి బిడ్డమోర మూచూస్తూ నాకుతూ దుఃఖపడుతూ "నాయనా ఆకలిగొంటివి పాలు కుడుచుకో" మని పాలుతాగించి "బిడ్డా ఇక నీకు అమ్మను చూచేప్రాప్తి లేదు. ఇదే చివరచూపు; రేపు యెవరు పాలిస్తారో! ఎట్లా బ్రతుకుతావో! నాయనా" అని విచారపడుతూ వుండగా కొమారుడు "అమ్మా నీవు చిన్నబోయిన దెందుకు? నీశరీరాన రక్తధారలు, గంట్లు, వున్నకారణం ఏమిటి? ఇట్లా

వ్యసనపడుతున్నావేమి? అని అడిగెను. అందుకు కామధేనువు చెప్పినవివరం. నాయనా! నేనీవేళ వర్షబాధకు తాళలేక మందలో తప్పి వొంటిగా వొక కొండలోయలోకిపోయి బెబ్బులికి పట్టుపడ్డాను. పోరానిచోట్లకుపోతే రారాని కష్టాలు రాకమానవు. అట్లా పులిరాజు నన్ను చంపి భక్షించేటందుకు యత్నం చేసేటప్పటికి నిన్ను కన్నమోహంచేత మొగ్గలేక నేను యిట్లా వేడుకున్నాను. వ్యాఘ్రరాజా! నేనీపొద్దు దొడ్డిలోనుంచి వచ్చేటప్పుడు, నాకుమారుడికి స్తన్యపానం యిచ్చిరాలేదు. కనుక నేను యింటికిపోయి నాబిడ్డకు పాలిచ్చి ఆకలి తీర్చి బుద్ధిచెప్పి యిరుగుపొరుగువారికి వొప్పగించి, నాలుగుగడియలలో సత్యం దప్పక తిరిగివస్తాను. నన్నింటికి పంపవయ్యా అని యెంతో వేడుకున్నంతట్లో వ్యాఘ్రరాజుకు దయవచ్చి త్వరగా పోయిరమ్మని సెలవిస్తే వస్తిని. నేను సత్యందప్పక పోవలెను. బుద్ధిగలిగివుండుమా అనెను. అంతట గొల్లుగొల్లున తానేడవ తల్లియేడవ కాగా కొంతకు కొమారుడు పలికినవివరం. అమ్మా! నీవుయెక్కడకు పోతావో నేనూ అక్కడకే వస్తాను. నీతోడిదే నాకు లోకం. ఆపులి నీతోపాటు నన్నుకూడా మింగితే మాతృభక్తులకు యేగతి కలుగుతుందో నాకూ అదేగది కల్గుతుంది. లేదా నీవు వెళ్లవద్దు వుండు. నీవు పెట్టుకున్నవొట్లూ సత్యాలూ నాకు తగుల్తవి. తల్లిలేక పోయినతర్వాత తనందేనికి? నీవు లేకపోతే నాకు దిక్కు

వ్వరుకి నా౹బతుకు ఎందునా పొందని దవుతుంది. పాలు తాగే బిడ్డలకు తల్లివంటి దైవంకద్దా! తల్లివంటి బంధువులున్నారా? అని యీవిధంగా కళ్లనీళ్లు కార్చుకుంటూ కాళ్లావేళ్లా బడి మొర పెట్టే టప్పటికి ఆకామధేనువు కొమారుణ్ణి బుజ్జగిస్తూ యీ విధంగాపలికెను. నాయనా! తక్కువ నోములు నోచి యెక్కువ ఫలాలు రమ్మంటే యెట్లావస్తవి? దైవంమనకింతే వ్రాసినాడు, పులిరాజుకు ఆహారం కాలసింది నేనేగాని నీకు పనిలేదు. నీవు అన్యాయంగాశరీరం యెందుకు వదలుకుంటావు? తనం వుంటేనే ధర్మా లన్నీనీ, కాబట్టి నీవురావద్దు. నాయనా! ప్రాణంపోయినా అబద్ధం ఆడరాదు. అందరికీ చావు వున్నదే. నిజం నిలుపుకో వలెను. తన నిజమే తనకు సహాయం అయ్యేది. నే పోవలెను నాయనా నే పోవలెను. నిన్నిట్లా అన్యాయంచేసి పోవలసినగతి నాకు వ్రాసివుండగా తప్పించడం యెవడితరం? నీతో సావాసాన మేసేదూడలను పొడవక పోట్లాడక కలసిమెలసి అన్యోన్యంగా వుండు. నిన్ను సాకేవారికి నీశరీరం అవిసేటట్టుగా దున్నుతూ పారిపోక, చిక్కులుపెట్టక, దొంగచేలుమేయక, పలువులు తెంచక, యీకోడే మంచికోడె అనిపించుకుని, నలుగురికీ మంచి తనంగా నడుచుకో; అడవులలో మనువులలో వుండేటవ్వాడు వాళ్లు మరచివుండబోకు. ఆనగొండితనాన వాడుదుడుకునేలల గడ్డిపరకలకు పోబోకు. ఆశకుపోతే యీలోకంలోనూ ఆలో

కంలోనూ చెరుపేవస్తుంది. గోళ్లున్న జంతువులనూ, కొమ్ము లున్న జంతువులనూ, విల్లంబు లున్నవారినీ, ఆడవాళ్లనూ, పళ్లనూ, ఎప్పుడూ నమ్మివుండరాదు. పసిమూడంది యేదికూడా కోరకరాదు. ఒంటిగా అడవులలో తిరుగవద్దు. ఎవరికీ బాధ కలిగించవద్దు. పరువు మర్యాదలతో బ్రతికిన బతుకే బ్రతుకు. జగత్తు నిజంకాదు. అంతామాయ. నాయనా! నీవు అడల వద్దు. నేను పులిపాలికి పోతాను" అని కుమారుణ్ణి మందలించి లోలోపల "కమతీవంటి తీవులేదే, అయ్యో! అయ్యో!" అని కళ్లనీళ్లు గ్రుక్కుకుంటూ, సత్యధర్మం తప్పజాలక ప్రయాణమై తనయీనువారితో జోడువారితో తనసంగతి అంతా తెలియ జెప్పి తనకుమారుణ్ణి వొప్పగించి యీవిధంగా పలికెను. అమ్మ లారా! దిక్కులేని నాబిడ్డణ్ణి కాపాడండి. మీకు వొప్పగిస్తున్నాను. చిన్నవాడు చిన్నవాడు. మంచీ చెడ్డా యెరుగడు. తగినబుద్ధి చెప్పండి. ఏయమ్మయినా యిన్నిపాలిచ్చి పుణ్యంకట్టుకోండి. తల్లిలేని బిడ్డని తలావొకపోటూపొడవక వెనకకువస్తే కాళ్లు విసరక ముందుకువస్తే ముట్టివిసరక తలతో సాదుచేసుకుని సాకుకొండి. వీడు నాబిడ్డకాడు; మీబిడ్డ; మి మ్మందరినీ చూచి బిడ్డను మీకు వొప్పగింతపెట్టడానికి వస్తిని. త్వరగా పోవలెను. తెలిసో తెలియకో మీకు నే నిదివరకు చేసిన అపరాధాలు క్షమించండి అమ్మలారా! అని ప్రార్థించి, కాళ్లమీదపడి కళ్లనీళ్లుకార్చి

కుంటూ నేను వ్యాఘ్రానకు భక్షణ నిమిత్తం పోతూవున్నా నని చెప్పెను. అప్పుడు కులము గోవులన్నీ ఆలోచనచేసి పలికిన పలుకులు. "దాని నుఖం చూరపోను! నీప్రాణం విడుచుకుని దాని కడుపు నింపుతావా? నీదారి నీదే దానిదారి దానిదే. నీ వేదో ఉపమచేతతప్పించుకుని ఎట్లాగూ రానేవస్తివి. చిన్నవాణ్ణి తల్లిలేనివాణ్ణిచేసి నీవు మళ్లీపోవద్దు. ఏవాొట్లయినా ఏసత్యా లయినా చావువూడేటప్పుడు విడనాడితే దోషం వస్తుందా? అందుకని ప్రాణం పోంగొట్టుకుంటూరా! పసి బిడ్డను అన్యాయం చేయువద్దు. ప్రాణాలు నిలుపుకునేపట్ల అబద్ధం ఆడినా తప్పులేదు. నీవుపోవద్దు. నిలు." అని మొక్కడలేని జాలితోనూ పలికేటప్పటికి కామధేనువు అనేమాటలు. నేను తనకు చిక్కినపుడే పులి చంపి వేస్తే యేమిచేయగలదాన్ని? ప్రాణానకపేక్షించి అసత్యం ఆడితే శాశ్వతంగా బ్రతుకుతానా? చావు ఎన్నటికైనా వున్నదే. ఎప్పటికీ సత్యాన బతికిన బతుకే బతుకు. ఇంకొకళ్ల ప్రాణా లకు సంకటంవచ్చినపుడు వాళ్లను రక్షించడానికి అబద్ధం ఆడితే ఆడవచ్చునుగాని తన ప్రాణాలకని తాను అబద్ధంఆడరాదు. అన్నమాటతప్పడానికి నాలుకా తాటిపట్టా! పులికి నమ్మికగా ప్రమాణం యిచ్చి వచ్చి మీమాటలచొప్పున పోకనిలిస్తే నరకమేగాని మోక్షప్రాప్తిలేదు. మోక్షం లేకపోయినతర్వాత నాకు యీశరీరం యీబ్రతుకు ఎందుకు? మీరు సంతోషంగా

నాకు సెలవివ్వండి. అని మనసుదిద్ది సమాధానపరిచేటప్పటికి ఆగోవులన్నీ నీవు మహాసత్యాత్మురాలవు; నీసత్యమే నీకుతోడై కాపాడుతుంది. పో, మాతల్లీ పో, అని జాలిజాలిగా కన్నీళ్లు విడుస్తూ వొప్పుకున్నంతలో కామధేనువు మందకుచుట్టివచ్చి ప్రదక్షిణంచేసి, వృక్షాలారా! పక్షులారా! వనదేవతలారా! జలదేవతలారా! తల్లిలేని నాపిల్లణ్ణి కాపాడండి, దిక్కుమీరే ననిదుఃఖంతో కడుపు తరుగుకునిపోయేటట్టు వేడుకుని ఆడిన మాట నిలుపుకునేటందుకు పులిరాజువున్న కొండలోయలోకి పోయెను. పోయి వ్యాఘ్రరాజుయెదుట నిలబడి మొక్కి "పులిరాజా! నే నాలస్యంచేయడంచేత నీ వాకలినిచాలా గాసి లితివి. నాకు దోషము వచ్చెను. అక్కడ నాకొమారుడు కాళ్లా వేళ్లా చుట్టుకున్నాడు. బంధువు లందరికీ కుమారుణ్ణి వొప్ప గించి వచ్చేటందుకు ఆలస్యం అయింది. నాతప్పుక్షమించి నీ కుక్షి అనే మహామోక్షానికి నన్ను పంపవయ్యా" అని వేడుకునేటం తలో తోక యెగనెత్తుకొని ఆకోడెదూడ పరుగుపరుగునవచ్చి తల్లికాళ్లముందర, పులిరాజుకు యెదురుగా, నిలబడేటప్పటికి పొందబొయ్యే చావునూ, ముందు అడ్డం వచ్చేబిడ్డనూ, చూచు కుని కామధేనువు యీవిధంగా పలికెను. పులిరాజా! ముందు నారక్తమాంసాలతో ఆకలి తీర్చుకుని, అంతట యీబిడ్డడితో కడుపునించుకొందువని వేడుకుంటాను. అన్నంతట వ్యాఘ్రి

రాజు పలికేవివరం — కామధేనువా! నీవు మహా సత్యాత్మ
రాలవని మొదటే నమ్మినాను. ఇటువంటి సత్యంతప్పని మహా
త్మరాలికి కీడుచేయ రాదనుకుని, అయినా నిజంపరీక్షచేసి చూదా
మని తిరిగి రమ్మన్నాను. కాకపోతే నాకు చిక్కినజీవికి బ్రతికి
పోవడంకూడా వుంటుందా? సత్యంతప్పక, ప్రాణాలకాశించక,
వస్తివి. ఇందుకే సంతోషం కలిగింది. నిన్ను భక్షించడంకన్న
అధికం తృప్తిచెందితిని. నిన్నూ చంపవలసినది లేదు; నీబిడ్డనూ
చంపవలసినది లేదు. ఇంత మహా సత్యాత్మరాలవైన నిన్ను
చంపితే నరకమేగాని వేరేగతి లేదు. కాబట్టి నీవూ నీ కుమా
రుడూ తిరిగిపోయి నీబంధువులతో సుఖానవుండండి. నాతప్పు
క్షమించు. అనెను. ఆవాక్యాలకు కామధేనువు “ఇట్లాయెం
దుకు అనుజ్ఞయిస్తావు; నేను నామందకుపోయి అచ్చాపచ్చా
తీర్చుకుంటూ ఆలస్యంచేసి వచ్చినానని కోపం వచ్చిందేమో!
నాకు తెలుసును. ఇక యింటికి పోవలసిందిలేదు. నేను సకల
మమతలూ తెగగోసుకుని ఏకచిత్తాన వస్తిని. కాబట్టి నన్ను
మన్నించి, భక్షించి మోక్షానకు పంపి సుఖానవుండుమని వేడు
కోగా మృగరాజు పల్కినవివరం. కామధేనువా! నీవుమహాసత్య
సంధురాలవు. నీసత్యంచేత పాపాత్ముడైన నాకు బుద్ధివచ్చింది.
నిన్ను చంపరాదు. నన్నురక్షించు. నీవు సాక్షాత్తూ గౌరి
లక్ష్మి, సరస్వతి, అహల్య, అరుంధతి, మొదలయిన దేవతలకు

సమానురాలవుగాని మరివొకటి కాదు. నీవంటి పుణ్యాత్మురాలు వుంటేనేగాని భూమిమీద నెలకు మూడువర్షాలు కురువవు. పాడి పంటలు తిన్నగావుండవు. ధర్మం నాలుగుపాదాలా నడవదు. కాబట్టి నాప్రార్థన మన్నించి నీవు సురక్షితంగావుండి నన్ను రక్షించు తల్లీ! అని వేడుకుంటూ వుండేటంతలో ఆసత్యదేవత ప్రత్యక్షమై కామధేనువుతో యిట్లు పలికెను. కామధేనువా! లోకంలో నరజన్మంయెత్తి చదువులు నేర్చిన పెద్దపెద్ద పేర్లవారే అడుగడుగుకూ ఆడినమాటలు తప్పుతూ అబద్ధపు సాక్ష్యాలు, అప్రమాణాలు, చేస్తూవుండగా పశుజన్మంయెత్తి నీవు ప్రాణాపాయం వచ్చినా అబద్ధంఆడక "ప్రాణానికంటె నిజానికి విలువ యెక్కువ" అనే నీతివాక్యం నిలిపినావు. ఆవుచేలోమేస్తే దూడగట్టున మేస్తుందా? నీవుత్రుడున్నూ నీకుతగినపుత్రుడే. లోకంలో తల్లి వంటిదైవంలేదు. నీబిడ్డ నీతోడిదే లోకం అని చావుకే తెగించి వచ్చాడు. పూవుపుట్టగానే పరిమళిస్తుందిగదా, నాకు చాలాసంతోషం కలిగింది. నాలోకం సత్యలోకాని మీరిద్దరూ రాతగ్గవారు. కనుక వేంచేయండి. ఇంకా మీరేమివరం కోరుతారో కోరుకోండి." అనగా కామధేనువు అన్నవాక్యం - అమ్మా నా పూర్వ పుణ్యంవల్ల మీకు నామీద దయకలిగిందికాని నావ శ్యం యేపాటిది? ఈవ్యాఘ్రరాజు నన్నుప్పుడు విడిచిపెట్టకపోతే నాసత్యం వెల్లడి కావడానికి వ్యవధికద్దా! ఇంత పుణ్యస్వభావం

పులిజాతిలో యెక్కడా వుండబోదు. ఇటువంటి యీవ్యాఘ్ర రాజును విడిచిపెట్టి మీలోకానికి రావడానికి మాకు మనసు రావడం లేదు. ధర్మంగాదు. మాకు అనుగ్రహించిన వరానకు ఈ వ్యాఘ్రరాజుకుకూడా, పుణ్యలోకం దయచేయండి'' అని వేడగా ఆసత్యదేవత సంతోషించి ముగ్గురినీ తనలోకానికి తోడుకొనిపోయెను.

శ్రీరస్తు.

బి. ఏ. బి. ఎల్. రెంటాల-వేంకటసుబ్బారావు పంతులుగారి

హెచ్చరిక.

ఈచిన్నపుస్తకములో వున్నకథ కొత్తది కాదు. అనేకులు యిదివరకు విన్నదే. కాని, దానిని శ్రీ ప్రభాకరశాస్త్రులవారు నీతులతో నింపి తెలుంగు మాట్లాడే జనుల కందరికీ సులభంగా బోధపడి మనోరంజకముగా వుండేలాగు వాడుకభాషలో తేట మాటలతో నూతనముగా రచియించినారు. ఈకార్యమువల్ల వీరు ఆంధ్రలోకానికి మహోపకారులుగా భావింపదగియున్నారు.

భారతం మొదలయిన మహాగ్రంథాలు చదివి పండితపదవి సంపాదించిన శాస్త్రులవారు వ్యాకరణనిబంధనలు పాటించకుండా ఈకథ వ్రాయడము, యీఘనకార్యము ఆంధ్రలోకానికి మహోపకారముగా భావింపదగ్గదని వుగ్గడించడము - యివి కేవలం విపరీతాలుగా కొందరిమనస్సులకైనా తోచడం నిశ్చయము. తెలుంగుభాషకు చేటుకాలం వచ్చింది కాబోలు నని ముక్కుమీద వేలుపెట్టుకుని కొందరు విస్మయంలోనూ విచారంలోనూ మునిగిపోవడంకూడా నిశ్చయమే. ఈకారణం వల్లను, ఈ ఫక్కీగా కథవ్రాయడానికి శాస్త్రులవారికి ప్రోత్సా

హం కలిగించినవాడ నగుటవల్లను, యీ హెచ్చరిక యిచ్చుట ఆవశ్యకంగా చేర్చడం యేర్పడినది. దీనిని విని భాషాభిమానులు తమకలవరం మానుదురుగాక !

ఒకటి రెండు సంవత్సరాలనుంచి న్యూసు పేపర్లలోనేమి మీటింగులలోనేమి తెలుంగుభాషనుగురించి చర్చలున్నూ వాద ప్రతివాదములున్నూ జరుగుతూవున్నవి. నన్నయ్య, తిక్కన్న, యెఱ్ఱన్న, పెద్దన్న, యిటువంటి పెద్దలు వ్యాకరణనిబద్ధంగా వుప యోగించినభాషే తెలుంగుభాష, అదేనేర్చుకోతగినది, ఆభాష లోనే గ్రంథాలు వ్రాయదగును, తక్కినభాష గ్రామ్యభాష, అవాచ్యము, అప్రశస్తము, వర్జనీయము, ఇట్లని కొందరు పండితులున్నూ—సామాన్యంగా అందరికీ బోధపడని గీర్వాణా నికి భాష అని పేరుపెట్టడం కేవలం హాస్యాస్పదం, కట్టుబాట్లతో చచ్చిపడివున్నది భాషకానేరదు, ప్రాణముతో పెరుగుతూ వున్నదే భాష, అదే గౌరవార్హము అట్టిదే దేశాభివృద్ధికి ఆధారము- ఇట్లని కొందరుపండితులున్నూ గుద్దులాడుకోవడమేగాక తగవు తీర్చుకోవడానికి కచేరీలకు యెక్కడందాకా కూడా వచ్చింది ! అజ్ఞానం హరించి అవివేకము శమించుగాక !

ఉన్నమాటంటే ఉడుకుబోతుతనం వస్తుందంటారు. అయినా ఒకప్పుడు అనక తప్పదు. ఇంతకూ ఆకాశవాణికి భయమేమిటి? ఆమె అన్నిభాషలకూ తల్లి. ఆంధ్రభారతి ఆంధ్రభారతి అని

యిక్కడ అందరూ నన్ను మాటలతో పూజిస్తూవున్నారేకాని క్రియలో రొష్టుపెట్టుతూవున్నారు—అని ఆమె మొత్తుకుంటూ వున్నది. అదుగో వినబడుతూవున్నది ఆమె మొర వినండి!

ఆకాశ వాణి మొర.

ఓ నాబిడ్డలారా! నాకు అన్నిభాషలూ ఒకటే అయినప్పటికీ సంగీతసాహిత్యవిద్యలమీద నాకువుండే ప్రీతిచేత ఆంధ్రభాషను యెక్కువమక్కువతో ప్రేమించి ఆంధ్రభారతి అనే పేరుతో యిక్కడ నెక్కొని చిరకాలంనుంచి ఘనంగా ఆదరింపబడుతూ వుంటిని. వయసు గడచినకొద్దీ నాకు వన్నె వచ్చి యౌవనం హెచ్చిందిగాని నారూపలావణ్యాలు యెంతమాత్రం మారలేదు. కాని, యిటీవల పడమటి బిడ్డలతోటి సాంగత్యంవల్ల నా ముద్దుబిడ్డల బుద్ధి చెడి నాయెడల అనాదరణ యేర్పడి నాకళకాంతులకు కూడా మబ్బుపట్టడం ఆరంభించింది.

అయ్యయ్యో! ఏదిక్కునవిన్నా నాబిడ్డల పోట్లాటలే వినబడుతూవున్నవి. నాకు యేమి దుర్గతి పట్టనున్నదో ఏమిదుస్థితి రానున్నదో గాని నాపెద్దబిడ్డలే వుపకారమని పేరుపెట్టి నాకు అపకారం చేస్తూవున్నారు.

తంత్రములారా! ఎందుకు ఈలాగు తన్నులాడుకుంటారు? తూర్పు పడమరల భేదం తెలియకుండా యెందుకు గుద్దులాడుకుంటూవున్నారు? అజంతభాష, హలంతభాష, పురుషభాష,

స్త్రీభాష, ఈభేదంతోవున్న భాషాతత్వం పడమటిబిడ్డలలో ఎంతటిపండితులకైనా తెలియకపోవడం ఆశ్చర్యంకాదు. వారి పుట్టుకలోనే దానికారణం వున్నది. ఆ రహస్యం తెలియకుండా వారు బోధించే భాషాతత్వం అన్నిభాషలకూ సమానంగా చెల్లదని మీరు తెలుసుకోలేక వారిపోలికలను మీయందు ఆరోపించుకుని ఎందుకు బొందలో పడుతూ నన్నుపడదోస్తూ వున్నారు? అయ్యయ్యో! ఈ తత్వరహస్యం సంపూర్ణంగా తెలిస్తే మీకు భేదంగాని పోట్లాటగాని వుండదుగదా! నేను యెంతనిమీతో మొరపెట్టుకుందును. నామొర మీకు వినబడడం యేలాగు? వినపడకపోతే విని తెలిపే మొనగాడెవడున్నాడు. తెలిపించి నా చింతతీర్చే నాథు డెవడున్నాడు? అయ్యో! అంతా నాకు అయోమయంగా వున్నది!

అజంతభాష, హలంతభాష, పురుషభాష, స్త్రీభాష, వీటికిగలభేదము—భాషయొక్కప్రాణము, శరీరము, బీజము, క్షేత్రము, స్వరప్రస్తారము, మాత్రాప్రస్తారము, గణప్రస్తారము, నానాజాతి వృత్తప్రస్తారము, వీటియొక్క తత్వరహస్యములు—భాషయొక్కమాధుర్యము, గానయోగ్యత, యివి దేని ననుసరించి వుండేదీ, యెట్టిభాషలు సంగీతసాహిత్యవిద్యలసంపూర్ణప్రస్తారమునకు యోగ్యములో, స్త్రీపురుషాక్షరసంజ్ఞలయొక్కసంయోగము, ఐక్యము, ప్రత్యేకరూపము - ఎట్టిభాషలో పద

ములు విడివిడిగా వుండునో, యెట్టిభాషలో జడగా అల్లుకొని పోవునో, యేమికారణమో—యెట్టిభాషలో ముందుకేసూటిగా అన్వయమో యెట్టిభాషలో ముందుకు వెనుకకు దుమికిదుమికి అన్వయమో, యేస్వాభావిక ధర్మంవల్ల యిది యేర్పడుతుందో- ఈ మొదలైన తత్వరహస్యములు తెలిస్తే అన్నిభాషలకూ ఒకటేవర్ణమాల యేర్పాటు చేస్తామని, అన్ని దేశాలకూ ఒకటే భాష యేర్పాటు చేస్తామని, అన్నిభాషలను వుచ్చారణప్రకారమే వ్రాయవలసినదని, యిట్టి పిచ్చివాదములు వుండవుగదా! నా బిడ్డలు భాషాభివృద్ధి పేరుచెప్పి అవలంబిస్తూవున్న వృథాప్రయత్నములున్నూ వృథాశ్రమయున్నూ తప్పిపోవునుగదా! ఏమి చేతును? ఎంతని మొరపెట్టుకొందును? నాచింత తీరేమార్గము యేమివున్నది? అయ్యో యేమిగతి!

ప్రతిభాషయందున్నూ వ్యవహరించడములో—అనగా వాడుకలో—కొన్నిమార్పులు కలగడంస్వాభావికమై వున్నది. ఈ మార్పులు బిడ్డలవల్ల, పామరులవల్ల, సామాన్యజనులవల్ల, ఒకవిధంగాను - పెద్దలవల్ల, బుద్ధిమంతులవల్ల, పండితులవల్ల, మరివొకవిధంగాను - కలిగింపబడడం కూడా స్వాభావికమే.

ఇంతేకాక మొట్టమొదట ఒకరితో వొకరు నోటిమూలంగా మాట్లాడుకొనడానికి యేర్పరుచుకోబడిన పదములు వ్రాతమూలంగా చదువుకుని గ్రహించుకొనడానికి వుపయోగింపబడడంవల్ల

మరికొన్ని మార్పులుకూడా భాషలో తటస్థిస్తూవున్నవి. ఈచెప్పబడ్డ అన్నిమార్పులవిషయంలో అజంతభాషలకున్నూ హలంతభాషలకున్నూ పురుషభాషలకున్నూ స్త్రీభాషలకున్నూ వాటిస్వాభావికధర్మమునుబట్టి చాలాభేదం యేర్పడుతూవున్నది. దీనివివరం గ్రహించుకోక పోవడంవల్లనే పోట్లాటలు, గుద్దులాటలు,గుడ్డివాదములు,పెడ్డభేదములు సిద్ధిస్తూవున్నవి. ఇది టూకీగా చెప్పదగినవిషయము కాదు. అందరికీ సులభంగా బోధపడే విషయమున్నూ కాదు.

ఏభాషలోనైనా సరే పుట్టుకలో యేర్పడ్డట్టుగానే పదాలు స్పష్టంగా సంపూర్ణంగా వుచ్చరిస్తూ మాట్లాడితే ఆలస్యం అయి వ్యవహారం కడతేరదు కాబట్టి వాడుకలో అనేకపదాలయందు స్వరలోపమున్నూ అక్షరలోపమున్నూ కలుగుతుంది. వ్రాసేటప్పుడు నిదానంగా వ్రాయవచ్చును గనుక యీలోపం అవసరంలేదు. మరిన్నీ సామాన్యజనులుగాక బుద్ధిమంతులున్నూ పండితులున్నూ వ్రాసేటప్పుడు, కొత్తకొత్త శబ్దజాలంకల్పించి సమస్తమైనవారు నిదానంగా చదివి నెమ్మదిగా నేర్చుకుని జ్ఞప్తియందుంచుకోవలసినవిషయములున్నూ గంభీరమైనవిషయములున్నూ తెలుపుతూ గద్యములు, పద్యములు, పదములు, మొదలయిన కవితలతో గ్రంథాలు రచియిస్తారు. ఈప్రకారంగా మాటభాష, వ్రాతభాష, గ్రాంథికభాష అని మూడుతెరగులు

ఏర్పడుతున్నవి. సామాన్యంగా లోకంలో సంభాషణ, వుత్తర ప్రత్యుత్తరాలు, వ్యవహారవిషయములు, మొదలయినవాటి సంబంధంలో వుపయోగింపబడుతూవున్నందున మాటభాషను వ్రాతభాషను కూడా వాడుకభాష అని చెప్పవచ్చును. గ్రాంథికభాషలో సంభాషణగాని, వుత్తరప్రత్యుత్తరములుగాని వ్యవహారములుగాని జరుపరు. అయితే యీ సందర్భంలో అజంతభాషలకున్నూ హలంతభాషలకున్నూ వాటిస్వాభావిక ధర్మమునుబట్టి కొండంతభేదం యేర్పడుతూవున్నది. హలంత భాషలు, స్త్రీభాషలు, వీటివిషయంలో వొకటే కాలపు వాడుక భాషకు గ్రాంథికభాషకు వుచ్చారణలో యెంతభేదంవున్నా వ్రాతలో వుపయోగించే అక్షరసంజ్ఞలలో భేదం వుండదు. ఇది స్వాభావికధర్మమునుబట్టే తటస్థించును. ఈకారణంవల్ల హలంత భాషలో గ్రంథాలు చెవులతో విన్నప్పుడు అర్థం అవుతూ వున్నప్పటికీ కంటితో గ్రహించి చదవడం కష్టంగా యేర్పడు తుంది. కాబట్టి యావజ్జీవము, ఉచ్చారణ నేర్చుకుంటూ మార్చు కుంటూనే వుండవలెను. పైగా కాలానుగుణ్యంగా భాషాస్వ రూపం కూడా మార్పు చెందుతూ వుంటుంది గనుకసామాన్య సంభాషణలోను, సాధారణపు వ్రాతలలోను, గ్రంథాలలోను, వన్నె భేదం, వైఖరీభేదమే గాని భాష వొకటిగానే కనిపిస్తూ, నానాటికి కలిగేమార్పులు కిందికీ పైకీకూడా వ్యాపిస్తూ వుండడం

వల్ల భాష జీవించివున్నట్టుగా యేర్పడుతుంది. ఇంక అజంత భాషలు, పురుషభాషలు, వీటివిషయంలో యెట్లావుంటుం దంటే - స్వరలోపాది కారణములవల్ల కలిగేమార్పులు చాలా అధికమగుటచేత సామాన్యంగా ఉపయోగింపబడే మాటభాష కున్నూ సామాన్యంగా వుత్తర ప్రత్యుత్తరములలోను వ్యవహారం లోను వుపయోగింపబడే వ్రాతభాషకున్నూ గద్యపద్యాది కవిత్వాలయందు వుపయోగింపబడే గ్రాంథిక భాషకున్నూ చాలావ్యత్యాసం యేర్పడడమే గాక ఈ జాతిభాషలు వాటి స్వాభావికధర్మమునుబట్టి వ్రాసినప్రకారమేవుచ్చరించి చదువబడ వలసిన కారణంవల్లను, గురులఘుప్రస్తారములతో పద్యాదికవిత్వ ములు గణబద్ధమై లేశమైనా మార్పుచెందడానికి వీలులేకుండా బిగిసివుండే కారణంవల్లను, మాటభాష వ్రాతభాష గ్రాంథిక భాష అని మూడు స్వరూపములుగా యేర్పడుతూవున్నవి. ఈ మూడింటియొక్క తారతమ్యమున్నూ వుపయోగమున్నూ విలువయున్నూ తెలుసుకోలేకనే హలంతభాషలయందువలె వాకటే జీవభాష యేర్పచవలెనని ప్రయత్నించడం, గ్రాంథిక భాషనుదూషించడం, వ్రాతభాషను ఆదరింపకపోవడం, మాట భాషను గ్రామ్యమని నిందించడం - ఇదంతా కేవలం అజ్ఞానము సూచిస్తున్నది. అయ్యో! నాపెద్దబిడ్డలే నాకున్నూ నాచిన్న బిడ్డలకున్నూ అపకారులైనారా! ఏమి విపరీతకాలంవచ్చింది!

గ్రాంథికభాషను పూజించే నాదొడ్డబిడ్డలారా! గ్రామ్య భాషను నిరసిస్తారే! అది నాచిన్నిబిడ్డలు, పేదబిడ్డలు మాట్లాడే భాష కాదా! నాచిన్నిబిడ్డల వచ్చీరానివలుకులు నాకు ముద్దు గావుండవా? ఎందుకు నిందిస్తారు? మీచెవులకుకూడా ఆనందకరం గా వుండబట్టేగదా గ్రామ్యభాషలో ప్రసంగాలున్నూ పదాలు న్నూ మీగ్రంథాలలో అక్కడక్కడ వుపయోగించి హాస్యరసం అనుభవిస్తారు. మీకు గ్రామ్యభాషవల్ల హాస్యరసం వుదయించి ఆనందం కలిగినట్టే అల్పజాతులబిడ్డలకు వాళ్లసుద్దులలో మీ భాష వుపయోగించిన సందర్భమందు హాస్యరసం వుదయిస్తుంది. వాళ్లసుద్దులున్నూ పదాలున్నూ పాటలున్నూ వాళ్లగ్రంథాలు. మీకవిత్వాలు మీగ్రంథాలు. వాళ్లగ్రంథాలు వినగూడదు, వ్రాయగూడదు, చదువగూడదు, అవిగ్రంథాలు కావు, మాగ్రంథాలే గ్రంథాలు అని యెందుకు పిచ్చివాదాలు చేస్తారు?

తెలుంగుభాష మాతృభాషగాగల జనులు 2,30,00,000 రెండుకోట్ల ముప్పైలక్షలమంది వున్నారుగదా! వీరిలో మాట రానివాళ్లకింద 30 లక్షలను తీసివేయండి. తెలుంగుమాట్లాడే తక్కిన రెండుకోట్లమందిలో యెందరు గ్రాంథికభాషలో వుత్తర ప్రత్యుత్తరాలు,వ్యవహారాలు,జరుపుకుంటారు? ఎందరు భారత భాగవతాది గ్రంథాలు చదువుతారు? ఇది కొంచెం తలచు కొనండి. అప్పుడు అంతా మీకు స్పష్టంగా బోధపడుతుంది.

తెలుంగుభాష మాట్లాడే రెండు కోట్లమంది జనులలో గ్రాంథికభాష మాట్లాడేవారు వొక్కరుకూడాలేరని చెప్ప వచ్చును. ఎవరైనా వుంటే వారు మహా మహా మహా పండితులే! పెండ్లామునుతోను, బిడ్డలతోను, చాకలివాళ్లతోను, మంగలి వాళ్లతోను, భారతాదిగ్రంథములభాష మాట్లాడే మహాను భావుడు వుంటే ఆయనగారి గొప్ప మెచ్చుకోవచ్చును. తర్వాతి మాట - ఈచెప్పిన రెండుకోట్లమందిలో భారతాది గ్రంథముల భాషలో వుత్తరప్రత్యుత్తరములున్నూ వ్యవహారములున్నూ జరుపుకునే మహానుభావు లెందరున్నారు? ఒకవేళ వున్నప్పటికీ వ్యవహారములు కొనసాగునా? నా దొడ్డబిడ్డలలో కొందరు బుద్ధిమంతులు సంధులు విడగొట్టి, జడలు చిక్కుదీసి, సులభ శైలిలో గ్రాంథికభాష వుపయోగిస్తూ మాట్లాడగలరు, వ్రాయ గలరు. నిజమే, అలాగు చేయగలవారు వందలుగాని వేలు లేరు. వారివ్రాతలుకూడా లక్షమందికంటె యెక్కువమందికి బోధపడ జాలవు. తక్కిన 199 లక్షలమందిగతి ఏమి కావలసినది? గ్రాంథిక భాష చదివితేను వింటేను అర్థం చేసుకోగలవారు లక్షమంది కంటె యెక్కువ లేరని మీకు స్పష్టంగా బోధపడవలెనంటే ఆయా జిల్లాలు తాలూకాలు గ్రామాలు వీధులు యిండ్లు గుడి సెలు—యీ ప్రకారంగా ఆంధ్రదేశంలో వాకమూలనుండి వాకమూలకు మీ మనోదృష్టి తిప్పిచూడండి! మనవ్యుతో

చూడకుండావూరికే నోటితో మాట్లాడకండి! మనోదృష్టివ్యా పింపజేసిచూస్తే ఆంధ్రదేశంలో యెక్కడగాని మాట్లాడుకొనడానికిన్నీ సామాన్యవుఁవ్రాతలకున్నూ వ్యవహారాలకున్నూ సంధులు విడగొట్టినసులభశైలిగల గ్రాంథికభాషకూడా వుపయోగించ బడడం లేదనీ వుపయోగించడానికి సాధ్యం కాదనీ స్పష్టంగా బోధపడగలదు. సులభశైలి అయినా కఠినశైలి అయినా గ్రాంథికభాష దొడ్డ గ్రంథాలకే ప్రయోజనము. అనగా కట్టుబాట్లకు లోబడి మార్పులు చెందకుండావుండే ప్రౌఢమయిన శబ్దజాలము మూలమున భక్తి, ముక్తి, నీతి, విజ్ఞానము ఆనందము మొదలయిన సార్వకాలిక విషయములను తెలిపే గద్యపద్య కావ్యములను కల్పించడమే గ్రాంథికభాషయొక్క వుపయోగము. ఎంతసులభశైలిని వ్రాసినా, ఒకటి రెండు లక్షల మందికి మాత్రమే యీగ్రంథములు వుపయోగము. తక్కిన 199 లక్షలమందిని యేగ్రంథాలు చదువుకొమ్మన్నారు? గ్రాంథిక భాషబంగారమే. ఎన్నోవన్నెలు ఉండవచ్చునుగాక! బంగారు బంగారే. గ్రాంథికభాషే భాష, తక్కినదిభాషకాదు, భారతాది గ్రంథములు తప్ప తక్కినవి గ్రంథములు కావంటే, తెలుంగు భాష తెలుంగు గ్రంథాలు లేనట్టే భావించుకోవలసి వస్తుంది. భారతాదిగ్రంథములు అర్థంకాని నా 199 లక్షలమంది బిడ్డలు గ్రంథాలులేనివారు, చదువురానివారు అవుతారు పరేగదా!

వారు తెలుంగు మాట్లాడగలవారైనప్పటికీ మూగవాళ్లే మృగ
ములే అని చెప్పవలెను. ఈవాదం మీకు బాగావున్నదా?

భారతాదిగ్రంథములు చాలా దొడ్డగ్రంథములు, ప్రశస్తమైన గ్రంథములు, అని అందరూ వొప్పుకుంటారు. చక్కగా చెక్కి నునుపుచేసి వన్నెపెట్టిన మానుతోను శిలతోను నిర్మించిన శాశ్వతసౌధములు రమ్యముగా వుండడం ఆశ్చర్యమా? నవరత్నాలుచెక్కినబంగారు ఆభరణాలను మెచ్చుకోని వారువుంటారా? పట్టుబట్టలు, జరీబట్టలు, యివి అందరికీ కన్నులపండువుగానే వుండును. అయితే సమస్తమైనవారు సౌధములే కట్టవలెను—మిద్దెలు, మేడలు నిర్మించుకొనే కాపురముండవలెను, సామాన్యపు యిండ్లు కట్టగూడదు—పూరియిండ్లు, గుడిసెలు బొత్తిగానే వుండగూడదు—అందరూ రత్నాభరణములు, బంగారు ఆభరణములు, వీటినే ధరించవలెను—అన్నివస్తువులు, అన్నిపనిముట్లు బంగారుతోనే చేయవలెను—పెద్దలూ పేదలూ అందరూ పట్టుబట్టలు, జరీబట్టలు, వీటినేధరించవలెను, అన్నివేళలయందు వాటినే కట్టుకోవలెను, అన్నిసమయములయందు రూప నిర్బంధములతో నిర్మించిన దుస్తులే ధరించుకోవలెను—ఈలాగు యేర్పాటుచేస్తే లోకము జరుగుతుందా? సౌఖ్యంగా వుంటుందా? మరియెందుకు గ్రాంథికభాషను వృద్ధిచేయడము అని పేరుపెట్టి దానికట్టుబాట్లను కొద్దికొద్దిగా చెరిపి పాడుచేసే

దాని అందమును మాధుర్యమును ధ్వంసంచేస్తారు? గ్రాంథిక భాషను సడలించి, పలుచనచేసి, చులకనచేసి సామాన్య కార్యములకు వుపయోగపరచవలెనని యెందుకు వృథాప్రయత్నము చేస్తారు? ఎందుకు పరిశుభ్రమైన వాడుక భాషను నిందిస్తారు? బంగారులో నీళ్ల కాగులు నిర్మిస్తారా, గడ్డపారలు చేస్తారా? చేస్తేకూడా అవి బాగా వుపయోగపడునా? గ్రాంథికభాష దొడ్డ భాష, పూజనీయమైన భాష. అది లోకవ్యవహారములయందు వుపయోగపడదు. రెండు కోట్లమంది ఆంధ్రజనులలో 199 లక్షల మందికి అది లభింపనే లభింపదు. కాబట్టి, నాదొడ్డబిడ్డలారా! నామొర కొంచెము చెవిని పెట్టండి! గ్రాంథికభాషయొక్క తత్వము తెలియక దానిలోకి పిచ్చిమార్పులు, కూర్పులు తెచ్చి పెట్టి, పరిశుద్ధముగానున్న నాకావ్య సౌధములను పాడుచెయ్యకండి. అగ్రగణ్యులైన మహాకవులు అప్పుడప్పుడు కల్పించే, కూర్చే క్రొత్త అందములతో తృప్తిచెంది మీబుద్ధిఅంతా వాడుక భాషను ప్రసిద్ధిలోకి తెచ్చి, పరిశుద్ధపరచి, వృద్ధిపరచుటయందు వుపయోగించండి.

వాడుకభాష అందరికీ కావలసినభాష—అందరు జనులు సామాన్యసంభాషణయందు, వుత్తరప్రత్యుత్తరాలయందు, లోకవ్యవహారాలయందు, ప్రతిదినం ప్రతినిమిషం వుపయోగిస్తూవున్న భాష. వాడుకభాషను కాగితము మీద నిందించేవారుకూడా

యింట ఆలుబిడ్డలతో మాట్లాడేది వాడుకభాషే ! మరెందుకు వాడుకభాషఅంటే నిందింపవలెను. యేలసిగ్గుపడవలెను? సామాన్యజనులు, పామరులు—నాబిడ్డలలో 199 లక్షలు వీరే—వీరి నిమిత్తము కల్పింపబడే గ్రంథాలువాడుకభాషలోనే వుండవలెను. ప్రస్తుతకాలములో అన్యసంబంధములవల్ల లభిస్తూవుండేజ్ఞానము వాడుకభాషలోనే వెల్లడి కావలెను. క్రొత్తక్రొత్త చరిత్రలు, శాస్త్రములు, కథలు, హాస్యములు, పాటలు, పదములు—యివన్నీ ప్రజలకు, బిడ్డలకు బోధపడవలెనంటే సంకరముచేసి పాడుచేసిన గ్రాంథికభాషలోగాక, నిజమైన, పరిశుద్ధమైన, మనోహరమైన వాడుకభాషలోనే వుండవలెను. ఈవాడుకభాష అనే ప్రత్యేకభాష అవిచ్ఛిన్నముగా యేర్పడివుండడము అజంతభాషలయొక్క, పురుషభాషలయొక్క గొప్పభాగ్యము. వార్తాపత్రికలను నాబిడ్డలు లక్షలకొలది చదివి అభివృద్ధికి రావలెనంటే వాటిని వాడుకభాషలోనే వ్రాయవలెను. కొంచెముగా గొప్పగా సడలించిన గ్రాంథికభాషకూడా జనసామాన్యమునకు బోధపడదు. కాబట్టి, గ్రాంథికభాషను కనికరములేక వంకర టింకరలుగా తిప్పి తిప్పలుపెట్టి తప్పులుకూర్చి పిచ్చిపిచ్చి శబ్దజాలమును కల్పించి గ్రాంథికభాషను, వాడుకభాషను, రెంటినీకూడా పాడుచేయకండి. నాదొడ్డబిడ్డలలో కొందరు పెద్దవ్రాతలని పేరుపెట్టి గ్రాంథికభాషలో పిచ్చివ్రాతలను వ్రాసి నాకు విచారం

కలిగిస్తూ వున్నప్పటికీ, కొందరు దొడ్డగ్రంథాలు కల్పించి నా గర్వము పెంపు చేస్తూవున్నారు. ఇది నాకు పరమానందమే. కాని, వీరు సమర్పించే పరమాన్నము నాబిడ్డలలో లక్షమంది కూడా ఆరగించి అనుభవించడం లేదు. పరిశుద్ధమై రుచికరముగా వుండే అంబలే 199 లక్షలమంది బిడ్డలకు ఆరోగ్యకరమైన ఆహారము. ఇది అత్యావశ్యకము. దీనినికూడా సంపాదించగలవారు నాదొడ్డబిడ్డలే. ముందటికాలంలో కొందరు బుద్ధిమంతులు వాడుకభాషలో కథలు, కీర్తనలు, పాటలు, పదములు హాస్యములు, మొదలైనవి కల్పించివున్నారు. గంగావివాహము, కుసలాయకము, బొబ్బిలికథ, దేశింగురాజుకథ, క్షేత్రయపదములు, సారంగపాణిపదములు, లంకాయాగము—మొదలైనవి నాబిడ్డలకు ప్రాణములు. వాడుకభాషలో అనేక గ్రంథములు నోటిపాఠాలలోను తాటాకుల పుస్తకాలలోను పైప్రాణాలతో నిలిచియున్నవి. వీటిని రక్షించి చక్కగా ముద్రించి సర్వజనులకు సులభంగా దొరకేటట్లుచేయుడం యెంతో పుణ్యకార్యము. ఈకాలంలోకూడా కొందరు బుద్ధిమంతులు వాడుకభాషలో హాస్యములు, కథలు, శాస్త్రములు, ధర్మశాస్త్రములు మొదలైనగ్రంథాలు వ్రాసియున్నారు. ఇవి ప్రతిపల్లెటూరిలో పూజింపబడుతూవున్నవి. కన్యాశుల్కము చదివి సంతోషించనివారుందురా? సంస్కర్తగారి గ్రంథాలలో, వాడుకభాషలో

వ్రాసిన హాస్యములేకదా అందరూ చదివి ఆనందిస్తూవున్నారు. కాబట్టి, దొడ్డనాయనలారా! విద్వాంసులారా! గ్రాంథికభాషను సంకరముచేసి నాగర్వమును భంగించక, వాడుకభాషనులఘు మార్గములో వృద్ధిచేసి, పరిశుద్ధిచేసి, మనోహరమైన కల్ప నలతో రమ్యముచేసి, జ్ఞానమును ఆనందమును పెంచే సర్వజనోప యోగములైన గ్రంథాలు వ్రాయండి, ముద్రించండి, ప్రచు రించండి! చిన్నబిడ్డం 199 లక్షలమందికి అభివృద్ధిమార్గము యేర్పరచండి! తల్లి ఆశీర్వచనమును పొందండి! శాశ్వతమైన కీర్తిని సంపాదించండి!!

తే-గీ॥ నోటితో పల్కి వినఁదగు ♦ నుడుఁగు లెట్లు
కాగితమువయి వ్రాయంగ ♦ గర్హ్యములగు?
తప్పు మీాయందె కలదని ♦ చెప్పనేల,
మంచినీళ్లు నిందింతురో ♦ మధువు మరగి?